


తగ్గిన మారుజాతర ఆదాయం

ప్రజాశక్తి - మక్కువ

గత ఏడాది కంటే ఈసారి మారుజాతరకు భక్తులు అమ్మవారిని సందర్శించుకోవడం ద్వారా వచ్చిన ఆదాయం రూ.3లక్షల 54 వేల మేరకు తగ్గుదల కనిపించింది. గతేడాది దర్శనాలు టిక్కెట్లు కేసుఖండన, లడ్డూ ప్రసాదాలు విరాళాలన్నీ కలిపి సుమారు రూ.9లక్షల 18,700పైసలుకు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.5లక్షల 64,056 మాత్రమే లభించిందని దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా వనం, చదురు గుడిల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను మాత్రం ఇంకా లెక్కించాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో వీటిని లెక్కించే సమయాన్ని ప్రకటించాల్సి ఉంది





పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న సిఐటియు, ఇఫ్టూ నాయకులు, కార్మికులు ; సీతానగరం మండలం నిడగల్లులో ఆందోళన చేస్తున్న స్కీమ్ వర్కర్లు

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

కార్మిక సంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగే నిరసనలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద, నాలుగు రోడ్ల కూడలి వద్ద కార్మికులు సిఐటియు, ఇఫ్టూ నిరసన, ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లె వెంకటరమణ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు జి.సర్వేశ్వరరావు, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు మాట్లాడారు. స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మకవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కోవిడ్ కాలంలో దుర్మార్గంగా పార్లమెంట్లో ఎటువంటి చర్చ జరగకుండా 2019లో వేతనాలు కోడ్‌ను, 2020లో పారిశ్రామిక సంబంధాల సామాజిక భద్రత కోడ్‌లను ఆమోదించిందన్నారు. ఇంత కార్మిక వ్యతిరేకమైన ఈ చట్టాలు రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదముద్ర పొందాయన్నారు. దీంతో ఏ క్షణానైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమావేశంలో కార్మిక నాయకుల సమక్షంలో ప్రకటించారని తెలిపారు. దీన్ని కార్మిక నాయకులంతా వ్యతిరేకించారని, ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చిందని తెలిపారు. కార్మిక హక్కులను కలరాసి పెట్టుబడులకు పెద్ద పీట వేయడానికి ఈ లేబర్ కోడ్లు వచ్చాయన్నారు. ఈ లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు సిఐటియు యావత్ కార్మిక వర్గాన్ని చైతన్యపర్చాలన్నారు. లేబర్ కోర్డుల వల్ల కార్మికులకు సంఘం పెట్టుకొనే హక్కు పోతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించే సమయం పెరుగుతుందని, సమ్మె చేసే హక్కు నిర్వీర్యమవుతుందని తెలిపారు. ఏ హక్కు లేనప్పుడే కార్మికవర్గం పోరాడి హక్కులు సాధించింది. పోరాడిన హక్కులు లేకుండా చేస్తామంటే కార్మిక వర్గం కాళ్లు ముడుచుకొని కూర్చోరాదని, పోరాడి మన హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, వర్తక సంఘం కళాసీలు రాగోలు, గేదెల రామారావు, సర్వేశ్వరరావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, సంతు, పాపులమ్మ, ఇప్పలమ్మ, శివ, ఎం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లు సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల ప్రాణాలకే భద్రత లేకుండా పోవడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, కనీస వేతనాలు అమలు లాంటి ప్రాథమిక చట్టాల అమలు అధోగతి అయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాలరాసే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గేదెల సత్యం, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతానగరం : లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా మండలంలోని నిడగల్లులో స్కీం వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సందర్భంగా శ్రామిక మహిళా నాయకులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, జి.జ్యోతి, వై.శాంతి కుమారి మాట్లాడారు. కార్మిక హక్కులు కాలరాసి పెట్టుబడులకు పెద్దపీట వేయడానికి లేబర్ కోడ్‌లు వచ్చాయన్నారు. లేబర్ కోడ్‌లు అమలుల్లోకి తెచ్చి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయబోతుం దన్నారు. అందుకు సిఐటియు యావత్ కార్మిక వర్గాన్ని చైతన్యపర్చాలన్నారు. పోరాడి మన హక్కులను సాధించుకోవాల న్నారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.జయలక్ష్మి, రాజమణి, అనసూయమ్మ, పుష్ప, మీనా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని బంటువానివలస వద్ద విజయశంకర ఫుడ్ ప్రొడక్ట్స్ (రైస్ మిల్) వద్ద పని ప్రదేశంలో యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. పోరాడి మన హక్కులను సాధించు కోవాలన్నారు. నిరసనలో యూనియన్ నాయకులు వి.శ్రీనివాసరావు, త్రినాధ, ఎ.సూర్యనారాయణ, బంటు శివన్నాయుడు కళాసీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ : కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబమూర్తి, అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ అనురాధ, ఆశా వర్కర్లు లీడర్ రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు లలిత మాట్లాడారు. కార్యక్రమంలో స్కీం వర్కర్లు పాల్గొన్నారు.





పార్వతీపురం మండలం బంటువానివలసలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రెడ్డి వేణు,; పాలకొండలో నిరసననుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణరావు

ఇల్లు కట్టకపోతే రద్దు : కలెక్టర్

అధికారుల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి -బలిజిపేట /సీతానగరం

గృహాలు మంజూరైన లబ్ధిదారులు తక్షణం తమ ఇళ్లను నిర్మించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. బలిజిపేట మండలంలోని మిర్తివలస, బలిజిపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణ లేఔట్లను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం గృహాలను మంజూరు చేసిందని, ఆ గృహాలను లబ్ధిదారులు తక్షణం నిర్మించుకోవాలన్నారు. ఇంకా నిర్మాణం చేయని గృహాలుంటే వాటిని రద్దుచేసి అవసరమైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారులకు అన్ని వివరాలను అవగాహన కలిగించాలని గృహ నిర్మాణ అధికారులను ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. అప్పటికీ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ముందుకు రాకపోతే సంబంధిత వివరాలు అందించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్ వేతనదారులతో ముఖాముఖి మాట్లాడారు. వేతనదారుల హాజరును పరిశీలించారు. ఫారం పాండ్లను నిర్మించుకొనేందుకు ఆసక్తి చూపించాలని కలెక్టర్ కోరారు. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారి వివరాలు పరిశీలించారు. ఉపాధి హామీ పనులను బాగా చేపట్టి గ్రామాల్లో ఆదర్శంగా నిలవాలని కోరారు. వంద రోజులు పని అందరూ వినియోగించు కోవాలని సూచించారు. మిర్తి వలస చెరువును పరిశీలించి అక్కడ జంగిల్ క్లియరెన్స్ చేయాలని, వర్షాలు కురిసినప్పుడు గండి పడకుండా గట్లును బలంగా వేయాలని తెలిపారు. సచివాలయంలో రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామ విజ్ఞాన కేంద్రాల్లో పోటీ పరీక్షలకు అనువైన అనేక పుస్తకాలు ఏర్పాటు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. మిర్తివలస అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల బరువు, ఎత్తులను పరిశీలించారు. వారికి అందిస్తున్న పౌష్టికాహార వివరాలను తనిఖీ చేశారు. చిన్నారులకు చక్కటి విద్యా ప్రమాణాలు ఇప్పటి నుండే బోధించాలని సూచించారు. పౌష్టికాహారాన్ని అందించి వారి ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఉన్న గర్భిణీలు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. టేక్ హెూమ్ రేషన్ ప్రతి ఒక్కరికీ అందాలని ఆయన స్పష్టం చేశారు. రక్తహీనత ఏ ఒక్కరికీ ఉండరాదని, గ్రామ సచివాలయ సిబ్బంది మంచి సేవలను అందించాలని ఆదేశించారు. పల్లె పండుగ, పంచాయతీరాజ్ పనులను ఫిబ్రవరి మాసాంతానికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు చేయడంలో జాప్యం చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సీతానగరం మండలం నిడగల్లులో జరుగుతున్న రహదారి పను లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



గృహలబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

బలిజిపేట మండలంలో పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్తివలసలో గల జగనన్న లేఅవుట్లు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీర ను మార్చుకోకపోతే విధులు నుండి తొలగించి పరిస్థితి వస్తుందని అధికారులను హెచ్చరించారు. అలాగే మండలంలోని పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న లే అవుట్లో ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్లలో సౌకర్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేకాధికారి కె.రాబర్ట్ పాల్, గృహ నిర్మాణ సంస్థ ఇన్చార్జి అధికారి డాక్టర్ పి. ధర్మాచంద్రారెడ్డి, బలిజిపేట ఎంపిడిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ కె.రత్నకుమారి, డిఇ జి,సోమేశ్వరరావు పంచాయతీరాజ్ అధికారులు అంబేద్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా విజయగౌరీని గెలిపించండి

ప్రజాశక్తి -వీరఘట్టం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరీ గెలిపించాలని, యుటిఎఫ్ నాయకులు ఎస్.మహేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలిగా విజయగౌరి గతంలో చేసిన ఉద్యమాలు, పోరాటాల గురించి వివరించారు. ఇంత వరకు శాసనమండలికి మహిళా ఉపాధ్యాయురాలిని ఎన్నుకోలేదని, ఈ అవకాశాన్ని రెగ్యులర్, కాంట్రాక్టు, ఉపాధ్యాయులు సహకరించాలని ఆయన కోరారు. ఆరేళ్ల ఉపాధ్యాయ సర్వీసును వదిలి ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, మీ మొదటి ప్రాధాన్యత ఓటు ఆమెకే వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం యుటిఎఫ్ ఎమ్మెల్సీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిటి రోడ్లు నాణ్యతగా ఉండాలి : పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని కొమరాడలో నిర్మిస్తున్న రెండు బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా దిగువ గుణద నుంచి సవర గుణద వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డుతో పాటు దిగువ గుణద నుంచి బిన్నిడి వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డును సందర్శించి, నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రహదారులు నాణ్యతగా ఉండాలని, నాణ్యత లేని రహదారులకు బిల్లులు చెల్లింపులు ఉండబోవని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణి రాజు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : పల్లె పండుగ కార్యక్రమం కింద చేస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకూడదని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పాలకొండ, వీరఘట్టం మండలాల్లో పర్యటించి పల్లె పండుగ కార్యక్రమం కింద చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాలకొండలోని టికెఆర్ పురం, చింతాడ, ఆర్తలి గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సంధర్భంగా సీసీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇంజనీరింగ్ పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. అదే విధంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి అన్ని పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వీరఘట్టం మండలంలోని ఎం.రాజపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడ కూడా పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఇలు సింహాచలం, రాధారాణి, లోకనాథం ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

మాత, శిశు మరణాలు సంభవించరాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఒక్క మాతా, శిశు మరణం కూడా సంభవించరాదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులకు హితవు పలికారు. ప్రతి గర్భిణి ప్రసవమయ్యే వరకు సంబంధిత పిహెచ్‌సి వైద్యాధికారి ఎఎన్ఎం, ఆశా వర్కర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రసవాలు బాగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో సంభవించిన మాతా, శిశు మరణాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు సంభవించిన మాతా, శిశు మరణాలపై పిహెచ్‌సిల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఏ ఒక్క కారణంతో మాతా, శిశు మరణం ఉండరాదని, గర్భిణులు ప్రభుత్వాసుపత్రికి వచ్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు పూర్తి బాధ్యతను వైద్యాధికారులు తీసుకోవాలని అన్నారు. మలేరియా కేసులు జిల్లాలో నమోదు కారాదని, కేసులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనీమియా నివారణకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామని, తద్వారా హిమోగ్లోబిన్ పెరిగేలా చూడాలని అన్నారు. అభా ఐడీలు పెండింగ్ లేకుండా చూడాలని, ఈహెచ్ఆర్ కచ్చితంగా అమలుచేయాలని, అనీమియా యాక్షన్ కమిటీ పక్కాగా జరగాలని పేర్కొన్నారు. భవిత కార్డులు నమోదు కావాలనీ, వైద్య సేవా రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తుగా పీఎం అవార్డుకు జిల్లా ఎంపిక కావాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీ - వార్మింగ్ డే)నువిజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. ఈమేరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, 17న మాప్ అప్ డే కార్యక్రమాలు జరగనున్నట్లు చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డా. బి.వాగ్దేవి, ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు, డిఎల్‌ఎటీఓ డా.ఎం.వినోద్ కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె.విజయ పార్వతి, ఐసీడీఎస్ పీడీ డా.టి. కనక దుర్గ,, పలువురు జిల్లా ఉన్నతాధికారులు, ప్రత్యేక వైద్యాధికారులు, వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కానిస్టేబుల్ అరుణ్‌కు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఓపెన్ స్టేట్ మీట్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబుల్ కెఆర్ అరుణ్ కుమార్‌ను బుధవారం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఎఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కె.అరుణ్ కుమార్ కాకినాడ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఎపి యూత్ అసోసియేషన్ వారి అధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ స్టేట్ మీట్ తైక్వాండో పోటీల్లో సీనియర్ పురుషుల విభాగంలో (80 కేజీల విభాగంలో) పాల్గొని విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ముగ్గురు సభ్యులు జట్టుగా ఆడే తైక్వాండో పోటీల్లో అరుణ్ కుమార్ జట్టు విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముమ్ముందు జరగబోయే క్రీడల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్ర, జిల్లాపోలీస్ ఖ్యాతిని పెంచాలని హితువుపలికారు. కార్యక్రమంలో ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు అరుణ్ కుమార్ అభినందించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

అధికారుల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతిలో డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటిడిఎలో పిఒ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి గ్రేడ్ విద్యార్థులను సి గ్రేడ్‌లో చేర్చడానికి ప్రత్యేక తర్ఫీదు, సబ్జెక్ట్ టీచర్లు ఇవ్వాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు టీచర్లకు దత్తత ఇవ్వాలని, సులభంగా ఉత్తీర్ణులై 50మార్కులకు ప్రశ్నలు తయారు చేయాలని అన్నారు. స్టడీ అవర్స్ పక్కగా నిర్వహించాలని, ఉత్తమ ప్రతిభ కనపర్చిన పాఠశాలకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, అందించే ఆహారం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ రవి ప్రసన్నకుమార్, ఎటి డబ్ల్యూఒ మంగవేని, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి : పిఒ

పిఎం జన్‌మాన్ కింద గిరిజనులకు మంజూరైన గృహ నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని అన్నారు. బుధవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పనులు చేస్తున్న గృహాలకు జియో ట్యాగింగ్ చేసి బిల్లులు అప్ లోడ్ చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఎంపిడిఒ గీతాంజలి, ఎఇ వెంకటేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు


ఉద్యోగాల సాధనలో సత్తాచాటిన అన్నదమ్ములు

ప్రజా శక్తి -భామిని

కృషి, పట్టుదల ఉంటే ఉద్యోగం సంపాదనకు పేదరికం అడ్డుకాదని సత్తా చాటారు పేదంటి ఆణిముత్యాలు ఆ అన్నదమ్ములు వలురౌతు లోకేష్, ఉపేంద్ర. మండలంలోని తల్లాడకు ఈ అన్నదమ్ముల్లో లోకేష్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లోనూ, ఉపేంద్ర సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించారు. వీరు పదో తరగతి బాలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో, ఇంటర్ మీడియట్ భామిని ఆదర్శ పాఠశాలలో చదువుకున్నారు. వీరి తండ్రి వి.గోవిందరావు, వి.జ్యోతి తమకున్న చిన్నపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కుమారుల్ని చదివించారు. ఈ రోజు కొడుకులిద్దరూ ఉద్యోగాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పేదరికంలోనూ కష్టపడి ఉద్యోగం సాధించడం చాలా గొప్ప విషయమని, ఎంతోమంది విద్యార్థులకు వీరు ఆదర్శనీయమని పలువురు గ్రామస్తులు కొనియాడారు.



ఉద్యోగాలను సాధించిన అన్నదమ్ములు లోకేష్, ఉపేంద్ర



సర్పంచిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు పురస్కారాన్ని పొందిన సర్పంచ్ పెంట సత్యంనాయుడును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు సర్పంచ్ కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరాడ ఆదినారాయణ, ఉపాధ్యాయులు జి.సావిత్రి, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్ డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

పిఎం సూర్య ఘర్ యోజన మంచి కార్యక్రమమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి అంతా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు ఈ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. ఈ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.



గోతులమయమైన బ్రిడ్జి

మరమ్మతుకు గురైన సువర్ణముఖి వంతెన

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రం సమీపాన గల మక్కువ- దుగ్గేరు రోడ్డు మధ్య ఉన్న సువర్ణముఖి నదిపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే వంతెన రిటర్నింగ్ వాల్ పూర్తిగా పాడైపోయి ప్రమాదకరంగా మారింది. అలాగే వంతెన ప్రాంతమంతా గోతులమయమైంది. మరోవైపు గోతులు ఏర్పడే చోట శ్లాబుకు వేసే ఐరన్ ఊచలు బయటపడి ప్రమాదకరంగా తయారయ్యాయి. రక్షిత మంచినీటి పైపు లీకై వచ్చిన వరదతో పాటు వర్షాకాలంలో పై నుంచి వచ్చే వరద కూడా వంతెన పైకి రావడంతో వాహన చోదకలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తోటపల్లిలో విగ్రహ పునఃప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లిలో వెంకటేశ్వరస్వామి వారి నూతన ఆలయం, విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు బుధవారం ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, ప్రాయ శ్చిత్తం ,రుత్విగ్వరుణ, దీక్షా వస్త్ర, కంకణధారణ, మత్యంగ్రహణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. పూజా కార్యక్రమాలు ప్రారంభం సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారని పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం కూడా పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని కొడవగంటి వెంకటనర సింహాచార్యులు, జంధ్యాల జగన్నాథ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు వి వి అప్పలాచార్యులు తదితరుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, ఐటిడిఎ ఆధ్వర్యంలో పార్వతీపురం పరిధిలో గల 11 చెరువులకు గాను రెండు లక్షల 74వేల 710 చేప పిల్లలను, అలాగే పిఎంఎంఎస్‌వై 2020-21 లో భాగంగా 16 డిపార్ట్మెంట్ చెరువుల్లో 1,27,200 చేప పిల్లలను విడుదల చేసినట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అభివద్ధి అధికారి ఎల్లేటి శ్రీదేవి,యం.సరళ నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఐటిడిఎ) జి.గౌరినాయుడు, ఎపిఎం బి.సన్నిబాబు, పార్వతీపురం మత్స్యకార సంఘం అధ్యక్షులు ఎం శ్రీనివాస్, సింగిడి గున్నారావు, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ ప్రసాద్

రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - సాలూరు

వాహనదారులంతా రహదారి భద్రతపై అవగాహన ఉండాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవిఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. బుధవారం రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుందని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ వైద్యులు డాక్టర్ పి.నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెదగుడబలో సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పెదగుడబ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త చింతాడ గౌరమ్మ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడకుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన బలవర్ధకమైన పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మరిపివలస సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట, మరిపులస సచివాలయాన్ని ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసిని సందర్శించి, దానిద్వారా సేకరణ ఏవిధంగా చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అలాగే వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించి మంచినీరందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పొగమంచుతో పొంచి ఉన్న ప్రమాదం

వాహనదారులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - సీతంపేట

మన్యంలో గత వారం పది రోజులుగా మంచు విపరీతంగా పడడంతో ఏజెన్సీని మంచు చుట్టుముట్టి దుప్పటి మాదిరిగా కప్పేసింది. దీంతో తెల్లవారుజామున వెళ్లాల్సిన వాహన చోదకులు ఉదయాన్నే కొలువుకు వెళ్ళినవారు స్కూల్ పిల్లలకు అవస్థలు తప్పడం లేదు. ఇక ఏజెన్సీలో దట్టమైన అడవి ఉండడంతో మైదాన ప్రాంతం కంటే ఏజెన్సీలో మంచు మరింత ఎక్కువ పడుతుంది. వేకువ జామున మంచు కురవడంతో ఇళ్లల్లో గోడలు చల్లగా మారి చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం 8 గంటల వరకు కనీసం రహదారి కనిపించుకోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోతున్నాయి. త్వరగా గమ్యానికి చేరుకోవాలని ముందడుగు వేస్తే ప్రమాదం తప్పువని పోలీసులు హెచ్చరి స్తున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ ఉదయం, వేకువజాము నుంచి చలి వేస్తూ పొగమంచు విపరీతంగా పడడంతో రోడ్డుపై ఉన్న ఒకరి ముఖం ఒకరికి కనిపించడం లేదు. సూర్యుడు ఉదయించే వరకు కనీసం రహదారి కనిపించకపోవడంతో గిరిజనులు బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క ఈ మంచుతో ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు, పిల్లలు, వృద్ధులపై మంచు ప్రభావం చూపుతుంది.



సీతంపేట ఏజెన్సీలో కురుస్తున్న మంచు

తలనొప్పి, జలుబు, దగ్గు, నీరసం వంటివి వస్తాయని అందుకే తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచనలు, సలహాలు మేరకు సంప్రదించాలని కోరుతున్నారు. మరోపక్క వాహనదారులు రోడ్డుపై నడిచే బాటసారులకు, వాకర్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది

'స్టెమి గుండె'కు ఏరియా ఆస్పత్రి భరోసా

ప్రజాశక్తి - సీతంపేట

స్టెమి గుండెకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేస్తూ భరోసా ఇచ్చినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో గుండెకు భరోసా అన్న వాల్ పోస్టర్‌ను సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వైద్యులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన గుండె పోటుకు సంబంధించిన లక్షణాలను వివరించారు. చాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం మొదటి గంటలోపు తీసుకోవాల్సిన చికిత్స గురించి వివరించారు. 108కు ఫోన్ చేసిన వెంటనే దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రికి, జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రాథమిక పరీక్ష నిర్వహించిన మొదటి గంటలోనే రూ.45వేల విలువైన (టెన్ క్టేప్లస్) ఇంజక్షన్ ను ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా అందించి ప్రాణాలను కాపాడుతామని తెలిపారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి ఇంజక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం కార్డియాలజిస్ట్ (గుండె వైద్య నిపుణులు)కు రిఫర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ డివి శ్రీనివాస్, మనోజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండబారిడిలో సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ మేనేజర్ షణ్ముఖరావు

అన్ని రకాల పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రబీ సీజన్లో పలు రకాల పంటలను వేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖ రాజు అన్నారు. మండలంలోని దూలికుప్ప, కొండబారిడి గ్రామాల్లో కొండగొర్రి తిరుపతిరావు, పత్తిక భాస్కరరావు రబీ సీజన్‌లో వేసిన పలు పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందాలంటే, ఏక పంట విధానం నుండి పలు పంటలు వేయాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి రైతు జిల్లాలోని 15 మండలాల్లో ప్రణాళికలు వేసి సిబ్బంది సహాయంతో పలు పంటలు సాగు చేయిస్తామని తెలిపారు. ప్రధాన పంట వేరుశెనగతో పాటు అదనపు ఆదాయం కోసం పొద్దు తిరుగుడు, ముల్లంగి, జొన్న, ఆకు, కూరగాయలు, తీగ జాతులు, నువ్వులు, బెండ, గోంగూర, ఆవాలు, మెంతి కూర మొదలగు పంటలు వేయడం వల్ల పంటల దిగుబడి ఆశాజనకంగా రావడంతో పాటు భూమి సారవంతం చెంది రైతుకు తక్కువ విస్తీర్ణంలో తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ పి.నాగేశ్వరరావు, నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ జి.అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పి.నరేష్, బాలయ్య, రవి, రైతులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్త హీనత సమస్య లేకుండా చూడాలి : పీడీ

ప్రజాశక్తి - భామిని

గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించిన ఆహారపదార్థాలు సక్రమంగా వినియోగించుకోవాలని, సూచించిన ప్రకారం మందులు వాడాలని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి కనకదుర్గ సూచించారు. మండలంలోని బొడ్డగూడ కంటైనర్ అంగన్వాడీ, భామిని 1,2, సన్నాయి కాలనీలో అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. గర్భిణీలకు ఆహార పదార్థాలు లభిస్తున్న పోషకాలపై అవగాహన ఉండాలని, తల్లీ బిడ్డ శారీరిక, మానసిక ఆరోగ్యంలో పోషకాలు క్రియాశీలకమని, గర్భిణీల్లో రక్త హీనత సమస్య తలత్తెకుండ జాగ్రత్త వహించాలని పి డి తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ శాంతి భవాని, సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, యాక్టింగ్ సూపర్ వైజర్ గురిబిల్లి సబితా ఉన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సమీపాన జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ.300 లభిస్తుందన్నారు. కొలతల ప్రకారం పనిచేయాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒతో పాటు టెక్నికల్ అసిస్టెంట్, వేతనదారులు ఉన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను, సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సూచించారు. మండలంలోని రేగులపాడులో బుధవారం నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణీలు క్రమం తప్పకుండా టిటి వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ విషయంలో నిర్లక్ష్యం చూపితే ప్రమాదానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని, గర్భిణీలకు సూచించారు. ఆయనతో పాటు ఎఎన్‌ఎం ఎం.కళావతి, సచివాలయ సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.



మహిళలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రెస్టారెంట్లు, హోటళ్లపై నిఘా పెట్టాలి

నాణ్యతకు పాతరేస్తున్న వారిపై చర్యలు చేసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా హెూటళ్లు, రెస్టారెంట్లు ఎక్కువయ్యాయని, వీటిలో ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తినుబండారాలను విక్రయిస్తున్నారని సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు విమర్శించారు. ఈనెల 2 3 ,4 తేదీల్లో పార్వతీపురంలోని వివిధ రెస్టారెంట్లు, హెూటల్లను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. హెూటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు కాసుల కక్కుర్తికి పాల్పడుతూ నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకుండా వంటలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యంత ప్రమాదకరమైన ఫుడ్‌కలర్స్, టేస్టింగ్ సాల్ట్, టేస్టింగ్ కెమికల్స్ వినియోగించి వంటలు చేస్తున్నారన్నారు. ప్రతి రెస్టారెంట్‌లో వాష్ రూమ్‌లు, పార్కింగ్ సౌకర్యం విధిగా ఉండాలని, వీటిని ఏ హెూటల్ యాజమాన్యం పాటించడం లేదని విమర్శించారు. వీటిపై నిఘా ఉంచాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రస్తుతానికి పార్వతీపురంలో లేరని వెంటనే ప్రత్యామ్నాయంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి హెూటళ్లు, రెస్టారెంట్లపై నిఘా పెట్టి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దీనిపై సిపిఎం నాయకత్వంలో త్వరలో మున్సిపల్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు పంట మార్పిడి చేయాలని, తక్కువ నీటితో పండిన అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలను గిరిజన ప్రాంతాల్లో పండించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని నీలంవలస, నాందేడవలసలో పొలం పిలుస్తుందిలో భాగంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నిమ్మగడ్డి సాగుతో అధిక లాభాలు పొందవచ్చని, వందెకరాల నిమ్మగడ్డి క్లస్టర్ ఏర్పాటు అయినట్లయితే నిమ్మగడ్డి నుంచి నూనెను తీసే బాయిలర్‌ను ఉచితంగా రైతులకు అందిస్తారని ఒకసారి వేసినట్లయితే పదేళ్ల వరకు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఫారం పాండ్ లు తవ్వుకొచ్చిన తెలిపారు. ఫారం పాండ్ గట్లపై కూరగాయలు పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు

చెక్ డాం పరిశీలన

ఈ సందర్భంగా రైతులు తమ పంటలకు నీటి సదుపాయం కలుగజేయాలని, చెక్ డాం మరమ్మతులు పూర్తి చేస్తే సుమారు వందెకరాలకు ఖరీఫ్, రబీలో సాగు నీరందుతుందని తెలిపారు. అనంతరం ఎపిఒ బి.సత్యనారాయణతో కలిసి చెక్ డ్యామ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు సాయిగణేష్, అనిల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని మరిపువలసలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆర్‌డిఎస్ విధానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి ఈ విధానంలో నువ్వులు పంటలో ఐదు రకాల పంటలు వేస్తామన్నారు. బెండ, ఆముదం, ముల్లంగి, గోరుచిక్కుడు, గోంగూర వేశారు. ఆర్‌డిఎస్ వల్ల లాభాలు, నువ్వు పంట వేసే రైతుకు అదనంగా ఆదాయం వస్తుందన్నారు. పంట వైవిధ్యత వల్ల ప్రధాన పంటకు మేలే



నీలంవలసలో చెక్‌డాంను పరిశీలిస్తున్న ఎఒ, ఎపిఒ

చేసేటట్టు రక్షక పంటలుగా ఉపయోగపడతాయి. ప్రధాన పంట చీడపీడల నుంచి రక్షింపబడుతుందని తెలిపారు. అలాగే జీడి పంటలో అంతర్ పంటగా చోడి పంటను సాగు చేస్తున్న పంటను పరిశీలించారు. జీడిలో మొక్కల మధ్య ఖాళీ స్థలాన్ని అంతర్ పంటలు వేయడం వల్ల అదనంగా రైతులకు లాభం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ ఆమని, రైతులు ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోగుకు ప్రత్యామ్నాయం నిమ్మగడ్డి సాగు

బలిజిపేట : మండలంలోని వెంగాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని స్థానిక ఎఒ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. నిమ్మగడ్డిని అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చని, బలమైన ఎర్ర నేలల నుంచి బలహీనమైన ఇసుక నేలల్లో కూడా సాగు చేయవచ్చని, బంజరు, బీడు, అటవీ నేలల్లో కూడా సాగు చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

రవిపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది ఊకె రవిపై దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తూ దాడికి ప్రయత్నించడంతో పాటు, ఆయన వాదిస్తున్న కేసులను, తన క్లైంట్స్ ద్వారా కేసు వెనక్కి తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని డ్రామాలాడుతూ, అశాంతియుత, ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న గిరిజనేతరులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ జెఎసి అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినందున పోలీసు వారు జాప్యం చేయకుండా వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి న్యాయ, చట్టబద్ధంగా పోరాడుతున్న న్యాయవాది రవిపై అక్కసుతో కొందరు గిరిజనేతరులు రవి ఇంటికి వెళ్లి, పురుగుల మందు తాగి చస్తాం అని బెదిరించారని తెలిపారు. గిరిజనేతరుల నుండి ప్రాణ హాని ఉన్నందున తెలంగాణాలో ప్రభుత్వం వెంటనే రవికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసీ ప్రజలు, ఆదివాసీ సంఘాలు ప్రత్యక్ష ఉద్యమం చేపడామని జెఎసి చైర్మన్ బిడ్డిక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సవర చిరంజీవి, కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

సూరిబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి - మక్కువ

అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక హమాలీల యూనియన్ కార్యదర్శి వడ్డే సూరిబాబుకు సంఘం నాయకులు, హమాలీలు ఘనంగా నివాళ్ళు అర్పించారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బి.గౌరు, ఎ.అప్పారావు అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సూరిబాబు లేని లోటును హమాలీలు గుర్తు చేసుకున్నారు. సంఘ నాయకునిగా ఆయన హమాలీలకు చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కళాసీ సంఘం నాయకులు గంగరాజు, ఈశ్వరరావు, పలువురు హమాలీలు పాల్గొన్నారు.

కస్పా వీధిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కస్పా వీధిలో బుధవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీయార్ అడ్వెంచర్ పార్క్ వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఎస్సై వై.అమ్మనరావు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు, వాహదారులకు అవగాహన కల్పించారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. హెల్మెంట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, దీనిపై తెలుసుకోవాలన్నారు. సైబర్‌నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ పోలీసులు తదితరులున్నారు.



పార్వతీపురంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినిలకు అగ్నిప్రమాదాల నివారణపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలను అంచనా వేస్తూ ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రమాదాలపై అవగాహన ఏర్పర్చుకొని వాటి చిక్కుకోకుండా స్వీయ రక్షణ కలిగి ఉండాలని అప్రమత్తం చేశారు. ఇళ్లల్లో వినియోగించే లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ వినియోగం, నిర్వహణపై అవగాహన కల్పించారు. వివిధ రకాల అగ్ని ప్రమాదాలను నివారించే పద్దతులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.అరుణజ్యోతి, ఉపాధ్యాయులు ఎల్.ఇందుమతి, కె.నిర్మల, కె గౌరీశ్వరి, జి.రాజేశ్వరి, ఎస్.లక్ష్మి, పి.గాయిత్రి, జె.సుధా శాంతి, కె.భవానీ, పి.గౌతమి, ఎస్.పార్వతి, కెజయ మంజూలత, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : పట్టణంలోని సినిమా హాళ్ల వ్యాపార సంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణ పరికరాలను అందుబాటులో ఉంచాలని పార్వతీపురం అగ్నిమాపక నివారణ అధికారి డి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని నర్సిపురంలో గల టిబిఆర్ సినిమా థియేటర్లో అగ్నిమాపక నివారణకు ఏర్పాటు చేసిన యంత్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సినిమా థియేటర్ యాజమాన్యంతో మాట్లాడుతూ అగ్నిమాపక నివారణ పరికరాల ఏర్పాటుతో పాటు వాటిని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించడం పట్ల సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలు అలవర్చుకొని సక్రమంగా చదువుకోవాలని నీలకంఠపురం ఎస్సై ఎ.నీలకంఠరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే కష్టపడి చదువుతూనే ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానంలో స్థిరపడగలరని అన్నారు. కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.కృష్ణారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 90 మంది హాజరు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 90 అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 30 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ వెంకట రమణ, కంపెనీల హెచ్ ఆర్ లు సంతోష్, శేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశీలలో ఎన్నారై సుధీర్ పట్టా నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహించిన టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 50మహిళలకు బుధవారం కేంద్రం నిర్వాహకులు అక్కేనా సుందరరావు, నరేంద్ర నాయుడు ఆధ్వర్యంలో ధ్రువపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు సంబంధించి గీత కార్మికులకు 50శాతం లైసెన్స్ ఫీజుకు రాయితీతో కేటాయించబడిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణను, ఈనెల 5 నుంచి 8 వరకు పొడిగించినట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడు ఒక ప్రకటనలో పేర్కొఆన్నారు. లాటరీ తేదీని ఈనెల 7నుంచి 10 వరకు మార్చడమైందని, ఈ అవకాశాన్ని గీతకులాల వారు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.